## స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి



రేవల్లిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు

గోపాల్‌పేట, నవంబర్ 2: ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్సై శివకుమార్ ప్రజలకు సూచించారు. గురువారం రేవల్లి మండల కేంద్రంలో పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు, ప్రజల్లో ఆత్మవిశ్వాసం పెంపొందేందుకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## మట్టిరోడ్డుకు మరమ్మతులు



అప్పారెడ్డిపల్లి ప్రధాన రహదారిపై గుంతలను చదును చేస్తున్న జేసీబీ

ఖిల్లాఘణపురం, నవంబర్ 2: మండలంలోని మల్కినియాన్‌పల్లికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని సర్పంచ్ శాంతసాయిలు గురువారం జేసీబీ సహాయంతో మట్టితో గుంతలను చదును చేయించారు. గుంతలమయైన రోడ్డుకు మట్టితో చదును చేయడంతో రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోనున్నాయని ఆమె చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ యువజన కన్వీనర్‌గా మహేశ్



నియామక పత్రం అందుకుంటున్న మహేశ్

కొత్తకోట, నవంబర్ 2 : తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ దేవరకద్ర నియోజకవర్గ యువజన కన్వీనర్‌గా టీజీ మహేశ్‌ను శాసన మండలి వైస్‌చైర్మన్ బండ్ల ప్రకాశ్ నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు. కొత్తకోట పట్టణానికి చెందిన మహేశ్ తెలంగాణ ఉద్యమకారుడిగా పని చేయడంతో ఆయన సేవలను గుర్తించి యువజన కన్వీనర్‌గా నియమితులయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను, యువజన ప్రధాన కార్యదర్శి జగన్, జాగృతి యువజన విభాగ కోకన్వీనర్ విజయ్, శ్రీను పాల్గొన్నారు.

## కోటిలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

కొత్తకోట, నవంబర్ 2 : మండలంలోని కానాయపల్లి స్టేజి సమీపంలో ఉన్న శ్రీదత్త కోటిలింగేశ్వరాలయంలో గురువారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి ఏకరుద్రాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శేఖరయ్య, మహేశ్వర్, అర్చకులు జగదీశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

కొత్తకోట, నవంబర్ 2 : మండలంలోని అమడబాకులలో మోడల్ స్కూల్ విద్యార్థులకు గురువారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఫోన్‌లో అపరిచిత వ్యక్తులు లింకులు పంపితే వాటిని వాడవద్దని, అలాగే ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు అధికారులమని ఓటీపీ చెప్పాలని అడిగితే సమాచారం ఇవ్వద్దన్నారు. బాలికలపై ఈవ్‌టీజింగ్ వంటి జరిపితే షీటిమ్‌కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి, భాస్కర్, రాఘవేందర్‌శర్మ, నాగరాజు, వైశాలి తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం

◆ కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



నామినేషన్ల స్వీకరణ కార్యాలయంలోని ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

వనపర్తి, నవంబర్ 2 : జిల్లాలో నామినేషన్ల స్వీకరణ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణకు కావాల్సి ఏర్పాట్లను గురువారం ఎస్పీ రక్షితాకృష్ణమూర్తితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో నవంబర్ 3 నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానున్నడంతో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ కార్యాలయానికి నామినేషన్ల వేయడానికి వచ్చే రాజకీయ పార్టీ అభ్యర్థులు చేరుకునే ముందు కలెక్టరేట్ నుంచి పలు చెక్ పాయింట్లను ఏర్పాటు చేశామన్నారు. ఆర్వో కార్యాలయంలో నామినేషన్లు అందజేసే సమయంలో ఐదుగురిని మాత్రమే అనుమతిస్తారని తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయంలోని పలు శాఖల సిబ్బందికి కార్యాలయం బయట గేటు వద్ద బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ తిరుపతిరావు, డీఎస్పీ ఆనంద్‌రెడ్డి, కలెక్టరేట్ అధికారులు, పోలీసులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వనపర్తి జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాజేంద్రసింగ్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

### ఎన్నికల వ్యయ పరిశీలకుడిగా రాజేంద్రసింగ్

వనపర్తి, నవంబర్ 2 : వనపర్తి జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులుగా 2008 బ్యాచ్ ఐఆర్ఎస్ రాజేంద్రసింగ్ నియమితులయ్యారు. గురువారం ఆయన వనపర్తికి వచ్చిన సందర్భంగా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, అదనపు కలెక్టర్ తిరుపతిరావు బొకే అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించిన ప్రణాళిక, ప్రొఫైల్, నియోజక వర్గానికి ఏర్పాటు చేసిన వ్యయ కమిటీ కార్యాలయం, మీడియో సర్టిఫికేషన్ ,మానిటరింగ్ కమీటీ, మీడియా సెంటర్‌ను పరిశీలించి ఇప్పటి వరకు సీజ్ చేసిన వివరాలు, ప్రకటనలకు సంబంధించిన అంశాలు పరిశీలించారు. ఆయన వెంట కలెక్టర్ , అదనపు కలెక్టర్ , ఆర్డీవో పద్మావతి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, వ్యవసాయ కమిటీ నోడల్ అధికారి శ్రీనివాసులు, డీపీఆర్వో సీతారాం ఉన్నారు.

## ఏఎన్ఎంలకు అసంక్రమిక వ్యాధుల నియంత్రణపై శిక్షణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్

వనపర్తి,నవంబర్ 2: 30ఏండ్లు పైబడిన వారందరికీ వైద్యరోగ్యశాఖ ఎన్‌పీఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా అసంక్రమిక వ్యాధులను పరిక్షించే విధానంపై ఏఎన్ఎంలకు శిక్షణ అందిస్తున్నట్లు డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్ తెలిపారు.జిల్లా వైద్యారోగ్యశాఖ సమావేశం మందిరంలో నిర్వహించిన జిల్లాలోని ప్రాథమిక రోగ్య కేంద్రాల ఏఎన్ఎంలకు నిర్వహించిన అసంక్రమిక వ్యాధుల నియంత్ర పై శిక్షణ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. కార్యక్రమంలో భాగంగా బీపీ, షుగర్, ఎత్తు, బరువు వంటివి పరీక్షిస్తారని, మధుమేహం, రక్తపోటు, ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ చేస్తారని ఈ వ్యాధుల లక్షణాలు కలిగిన వారిని గుర్తించి వెంటనే రిఫరల్ చేసి ఉన్నతమైనంటువంటి దవాఖానలకు పంపించి నిర్ధారణ చేస్తారన్నారు. అవసరమైన చికిత్సలను చేయిస్తారన్నారు. సర్వేలో గుర్తించిన వారి వివరాలన్నింటిని కూడా ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఈ వ్యాధులన్నీ కూడా జీవనశైలికి సంబంధించిన వ్యాధులనీ జీవన విధానాన్ని మార్చుకోవడంతో శాఖాహారాన్ని తీసుకోవడంతో ప్రతిరోజూ వ్యాయామం చేయడం, యోగా, మెడిటేషన్ వంటివి చేయడంతో ఒత్తిడి తగ్గించుకోవడంతో ఈ వ్యాధుల భారీన పడకుండా తమను తాము రక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌పీఎన్‌సీడీవో డాక్టర్ రామచంద్ర, స్టేట్ ఓటీ డాక్టర్ వైష్ణవి, ఎన్‌సీడీ కో ఆర్డినేటర్లు సాయిరెడ్డి, మహేశ్, డీడీఎంలు వెంకటకృష్ణారెడ్డి, గిరిజ, డబ్ల్యూహెచ్‌వో ఊహశ్రీ, జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులముమ్మరత నిఖీలు

◆ బెల్టు షాపులపై దాడులు ◆ మద్యం పట్టివేత

ఖిల్లాఘణపురం, నవంబర్ 2: రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బు తదితర వస్తువుల సరఫరాలను అడ్డుకునేందుకు మండల కేంద్రంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. అందులో భాగంగానే గురువారం మండల కేంద్రంలో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసులు వాహనాలను తనిఖీలు చేశారు. ఎవరైనా అక్రమంగా మద్యం, డబ్బు తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రూ.50వేల కన్నా ఎక్కువ నగదు ఉంటే వాటికి సంబంధించిన రసీదులను చూపించాలని తెలిపారు.



ఖిల్లాలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

### బెల్టుషాపుపై దాడి



అప్పారెపల్లిలో మద్యం స్వాధీనం చేసుకున్న పోలీసులు

మండలంలోని అప్పారెడ్డిపల్లిలో గురువారం బెల్టుషాపుపై ఆకస్మిక దాడి చేశారు. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ బెల్టుషాపులో రైడ్ నిర్వహించగా 2.16 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.2,160 ఉంటుందని ఎస్సై శ్రీహరి చెప్పారు. అనుమతులు లేని మద్యం లభించడంతో మద్యాన్ని సీజ్‌చేసి అతనిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేంద్ర సాయుధ బలగాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

వనపర్తి, నవంబర్ 2: తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు రెగ్యులేటరీ కమిటీ ఆవిర్భా దినోత్సవాన్ని పురస్కరించుకొని వినియోగదారుల దినోత్సవం జరపడానికి టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆదేశాలు జారీ చేసినట్లు సూపరిండెంట్ ఇంజినీరింగ్ అధికారి పీవీ నాగేంద్రకుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సర్కిల్, డివిజన్, సబ్ డివిజన్‌లో గృహ, వ్యాపార, పరిశ్రమల, వ్యవసాయ వినియోగదారులతో సమావేశం నిర్వహించి విద్యుత్‌కు సంబంధించినటువంటి సమస్యలను పరిష్కరించాలని, విద్యుత్‌ను సరైన పద్ధతిలో వినియోగించుకోవడంపై అవగాహన కల్పించాలని, వనపర్తి డివిజనల్ ఇంజినీరింగ్ కార్యాలయంలో ఉదయం 10గంటలకు నిర్వహించనున్న విద్యుత్ వినియోగదారుల సమావేశానికి పెద్దఎత్తున్న వినియోగదారులు పాల్గొనాలని సూచించారు.

## చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

వనపర్తి టౌన్, నవంబర్ 2: ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, రాజ్యాంగ రిజర్వేషన్ల పరిరక్షణ కోసం చేపట్టబోయే చలో ఢిల్లీని విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు భగత్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో డిసెంబర్ 4న ఢిల్లీలో జరుగనున్న జాతీయ సదస్సును విజయవంతం చేయాలని, సదస్సుకు మద్దతుగా సంతకాల సేకరణను చేపట్టామన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, సామాజిక న్యాయం, ప్రైవేటీకరణలో రిజర్వేషన్లను నిర్వీర్యం చేస్తున్నారని వాటి పరిరక్షనే ధ్యేయంగా ఢిల్లీలో సదస్సును నిర్వహిస్తున్నామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీసెల్ కన్వీకర్ గంధం నాగరాజు, కేవీపీఎస్ నాయకులు మన్నెం, నారాయణ, భీసన్న, రాములు, వెంకటేశ్, దేవన్న తదితరులు ఉన్నారు.



సంతకాల సేకరణ చేస్తున్న నాయకులు